

# మూడు ఖర్చులు

మంచి కరువు కాలాన ఒక పెద్దాయన ఒకచోటు నుంచి యింకోచోటుకు ప్రయాణం పెట్టుకున్నాడు. కరువు రోజుల్లో చుట్టుపక్కలు ఎలా వుంటాయో తెలిసిందే గదా. ఎండిపోయిన పైర్లు. పగుళ్ళిచ్చిన నేలలు. నీళ్లింకిపోయిన చెరువులు. అల్లాడుతున్న జనం. ఆహా కలికాలం వచ్చేసింది గదా అని అదంతా చూసుకుంటూ వస్తున్నాడంట పెద్దాయన.

కొంతదూరం వచ్చాక ఆయనకు ఒక పొలం కనిపించింది. అది పచ్చగా కళకళలాడతా వుంది. ఓర్నీ యిదేందిరా సామీ అని చూస్తున్న పెద్దాయనకు కాసేపటికి ఆకాశాన కదిలొస్తున్న ఒక నల్లటి మబ్బు కనిపించింది. అది ఆ పొలం ఎంతవరకు ఉందో అంత వరకే వచ్చి నిలబడింది. నిలబడి ఆ పైరుకు ఎంత వాన కావాలో అంత వానా కురిపించి వెళ్లిపోయింది.

ఇదంతా చూసి పెద్దాయనకు మతిపోయింది. ఆ పొలంలో దిగి పనులు చేసుకుంటున్న రైతు దగ్గరికి వెళ్లి 'ఏమయ్యా. నేను యింతదూరం నుంచి వస్తున్నాను. ఎక్కడా పచ్చి గరిక కూడా మొలిచుండలేదు. నీటిచుక్క కురిసుండ లేదు. నీ పైరేమో విరగపండుతోంది. నీపైనే వాన కురుస్తా వుంది. ఏమి ఈ మాయ? అని అడిగాడు.

'ఏమో సామీ. నాకేమి తెలుసు. నేను యవసాయం చేయడం మొదలెట్టినప్పటి నుంచి ఎవరికి వానలు కురిసినా కురవకపోయినా నా చేనుకి వాన కురస్తానే వుంది. ఎవరికి పండినా పండకపోయినా నా చేను పండుతానే వుంది' అన్నాడు ఆ రైతు.

'కాదు. యిందులో ఏదో మతలబు వుండే వుంటుంది. నీ జమాఖర్చుల సంగతేందో చెప్పు' అన్నాడు పెద్దాయన.

'ఏమి లేదు సామీ. పంట పండించాక వచ్చిన సొమ్ముని నేను మూడు ఖర్చులుగా విడగొడతాను. ఒక ఖర్చు నా యింటికీ సంసారానికీ వుంచుకుంటాను. ఒక ఖర్చుని పంటకీ విత్తనాలకీ పాడికీ పశువుకీ వుంచుకుంటాను. మూడో ఖర్చుని పేదలకీ సాదలకీ పంచిపెడతాను' అన్నాడు రైతు.

'అదీ. అలా చెప్పు. యింక నీకు కురవకపోతే యింకెవరికి కురుస్తుందయ్యా వాన' అని వెళ్లిపోయాడు ఆ పెద్దాయన.

✪ ఈ కతను మా చిన్నఫుప్పు భర్త రహెమాన్ ఫుప్పా చెప్పాడు. ఆయన ఒకప్పుడు రైతు. ఇప్పుడు మసీదులో మౌజన్.